ధాన్యం బకాయిల కోసం ఎదురుచూపులు

- పాలకొల్లు నియోజకవర్గంలో 6500 మంది రైతులకు ఇబ్బంది
- 46,630 మెట్రిక్ టన్నుల ధాన్యానికి విడుదల కాని సొమ్ము

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు నియోజకవర్గంలో రైతులు ధాన్యం బకాయిల కోసం ఎదురు చూపులు చూస్తున్నారు. ధాన్యం సొమ్ములు ఏప్రిల్ 27 వరకు రైతుల ఖాతాల్లో సొమ్ములు జమ అయ్యాయి. 28వ తేదీ నుంచి ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ధాన్యం సొమ్ములను రైతుల ఖాతాల్లో జమ కాకుండా నిలిపివేశారు. దీంతో ప్రతి మండలంలోని 60 శాతం మందికి పైగా రైతులకు ధాన్యం సొమ్ములను ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ మొదలు కాబోతుంది. దమ్ములు చేసుకోవడానికి, విత్తనాలు కొనుగోలుకి, ఎరువులు, అలాగే కూలీలకు చెల్లించడానికి రైతుల వద్ద సొమ్ములు లేక ఇబ్బందులు పడుతున్నారు. ధాన్యం మిల్లులకు తోలి 50 రోజులు పైనే గడిచాయి. అయితే ఇప్పటి వరకు సొమ్ములు రైతుల ఖాతాల్లో జమకాకపోవడంతో ఆందోళన వ్యక్తం చేశారు. పాలకొల్లు నియోజకవర్గంలోని పాలకొల్లు, యలమంచిలి, పోడూరు మండలాల్లో సుమారు 6500 మంది రైతులకు 46,630 మెట్రిక్ టన్నుల ధాన్యం సంబంధించి బకాయిలు చెల్లించాలి. ప్రతి రోజూ రైతులు బ్యాంకుల చుట్టూ తిరుగుతూ సొమ్ముల జమ అయ్యాయోమో చెప్పాలంటూ బ్యాంక్ అధికారులను ప్రాధేయపడుతున్నారు. అధికారులు జమ కాలేదని చెప్పడంతో ఉసూరుమంటూ వెనుదిరుగుతున్నారు. ప్రభుత్వం తక్షణం స్పందించి రైతులకు ధాన్యం సొమ్ములు జమ చేయాలని అధికారులను కోరుతున్నారు.


దగ్గులూరులో మిల్లుకి ధాన్యం తోలడానికి పట్టుబడి చేస్తున్న దృశ్యం


శివదేవునిచిక్కాలలో మిల్లుకి ధాన్యం తోలడానికి పట్టుబడి పడుతున్న దృశ్యం

మండలం	సాగులో ఉన్న భూమి	కొనుగోలు చేసిన ధాన్యం	సొమ్ము అందాల్సిన రైతులు
పాలకొల్లు	9500 ఎకరాలు	28,000మెట్రిక్ టన్నులు	2001
పోడూరు	14000 ఎకరాలు	41,000 మెట్రిక్ టన్నులు	2500
యలమంచిలి	5,760 ఎకరాలు	15,139 మెట్రిక్ టన్నులు	1950

150 బస్తాలకు సొమ్ములు చెల్లించాలి



నేను కౌలు రైతుని. ధాన్యం మిల్లుకి తోలి 40 రోజులు పైనే గడిచింది. 150 బస్తాలు మిల్లుకి తోలాను. ప్రతి రోజూ బ్యాంక్‌కి వెళ్లి ఖాతాల్లో ధాన్యం సొమ్ములు పడ్డాయేమోనని పరిశీలించుకుంటున్నా. రైతుకి కౌలు చెల్లించాలి. అధికారులు స్పందించి తక్షణం బకాయిలు రైతులకు చెల్లించాలి.
– తండా ఇస్సాక్ రాజు, కౌలు రైతు, శివదేవునిచిక్కాల

ఖరీఫ్ పెట్టుబడికి ఇబ్బందులు



దాళ్వా ధాన్యం డబ్బులు ప్రభుత్వం చెల్లించలేదు. నేను 160 బస్తాల ధాన్యం మిల్లుకి తోలాను. సార్వా సీజన్ ప్రారంభం కాబోతుంది. పెట్టుబడులకు డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నాం. దాళ్వా పంటకు సంబంధించి ఎరువులు, పురుగుమందులకు, ఇతర ఖర్చుల నిమిత్తం చేసిన అప్పులు తీరలేదు. – విశ్వనాథం పేరయ్య, కౌలు రైతు, దగ్గులూరు

సాగు ఆలస్యం



సార్వా సాగుకి సంబంధించి ఆకుమడి దమ్ము చేయడం లేదు. పాత బకాయిలు చెల్లిస్తేనే దమ్ము చేస్తామని ట్రాక్టర్ యజమాని చెబుతున్నారు. అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా స్పందించడం లేదు. నేను మిల్లుకి ధాన్యం తోలి 50 రోజులు గడిచింది. ప్రభుత్వం స్పందించి రైతులకు ధాన్యం బకాయిలు చెల్లించాలి.
– బొడ్డేటి సూర్యనారాయణ, కౌలు రైతు, గవరపేట

ధాన్యం బకాయిలు వెంటనే చెల్లించాలి

పెనుగొండ: రైతులకు చెల్లించాల్సిన ధాన్యం బకాయిలు తక్షణం చెల్లించడానికి చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి ఎస్.వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం పెనుగొండ తహసీల్దారు కేవీవీ రోహిణికి వినతి పత్రం సమర్పించారు. ముఖ్యంగా రైతులు సార్వా సాగుకు సన్నద్ధమవుతున్నా అమ్మిన ధాన్యం డబ్బులు చేతికందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతాంగానికి ధాన్యం డబ్బు ఎంతో ముఖ్యమన్నారు. సొమ్ము చెల్లించడంతో పాటు విత్తనాలు, ఎరువులు, అందుబాటులో ఉండే విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. సార్వాసాగుకు ప్రతి కౌలు రైతుకూ కౌలు కార్డులు అందచేసి, పంట రుణాలు అందించాలన్నారు. కొన్ని ప్రాంతాల్లో సార్వా సాగు ఆకుమడులకు నీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సాగునీరు పంట కాలువల ద్వారా అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు షేక్ పాదుషా, నాగిశెట్టి గంగారావు, శీలం యేసు, మాదాసు నాగేశ్వరరావు తదిరులు పాల్గొన్నారు.


పెనుగొండలో తహసీల్దారుకు వినతి పత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

ముమ్మరంగా పంటబోదె తవ్వకం పనులు

మొగల్తూరు: మండలంలోని పలు గ్రామాల్లో పంటబోదె తవ్వకం పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. మండలంలోని కేపీ పాలెం సౌత్, నార్త్, మొగల్తూరు పంచాయతీలోని పాలకమ్మచెరువు, నక్కావారిపాలెం, పడమటిపాలెం తదతర ప్రాంతాలలో గత రెండు రోజులుగా పంటబోదె తవ్వకం పనులు వేగంగా సాగుతున్నాయి. దాళ్వా సాగుకు సంబంధించి ప్రతి ఎకరాకూ సాగు నీరందంచినట్లుగానే సార్వా సాగుకు శివారు భూములకు కూడా సాగు నీరందించాలనే ఉద్దేశంతో పంటబోదెల తవ్వకం పనులు చేపట్టారు.


కేపీ పాలెం సౌత్‌లో పంటబోదె తవ్వుతున్న ఉపాధి కూలీలు

ఉపాధి హామీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

భీమవరం అర్బన్: ఉపాధి హామీ కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా, వారికి సకాలంలో బిల్లులు చెల్లించకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని సీఐటీయూ జిల్లా నాయకులు ఎమ్. ఆంజనేయులు, ఇంజేటి శ్రీనివాస్ అన్నారు. భీమవరం మండలంలోని తుందుర్రు, కె. బేతపూడిలో ఉపాధి హామీ కార్మికులను మంగళవారం సీఐటీయూ నాయకులు కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ ఉపాధి హామీ కార్మికులకు మే నెల నుంచి బిల్లులు చెల్లించకుండా రెండు పూటల మస్టర్ పేరుతో ఉదయం 6 నుంచి మధ్యాహ్నం వరకు పని చేయించడం, పే స్లిప్పులు, జాబ్ కార్డులు, పనిముట్లు ఇవ్వకపోవడంతో పాటు మెడికల్ కిట్లు వంటి సౌకర్యాలు కల్పించలేదని అన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని కట్టుదిట్టంగా అమలు చేయకుంటే ఉద్యమాలను ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బుంగా సంతోష్, పాలపర్తి చంద్రపాలు, నేతల ఝాన్సీ, దేశభక్తుల నాగరత్నం, గుబ్బల మంగతయారు, పెద్దిరాజు, ఏలూరు లాజర్, బుంగా మరియమ్మ, మోకా యోసయ్య పాల్గొన్నారు.


బేతపూడిలో ఉపాధి హామీ కూలీల సమస్యలు తెలుసుకుంటున్న సీఐటీయూ జిల్లా నాయకులు

ఝాన్సీలక్ష్మీబాయికి ఘన నివాళి

మొగల్తూరు: తన జీవితాన్ని బలిదానం చేసుకుని మహిళా లోకానికి ఝాన్సీలక్ష్మీభాయి ఆదర్శంగా నిలిచారని హెచ్ఎం పెనుమత్స రామరాజు తెలిపారు. ఝాన్సీలక్ష్మీ భాయి వర్ధంతిని మంగళవారం ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఝాన్సీలక్ష్మీబాయి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ఝాన్సీలక్ష్మీబాయిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాగిడి రాంబాబు, ఉపాధ్యాయులు కేఎస్ఎస్ రాజు, వాటాల మాధవ రాజు తదితరులు పాల్గొన్నారు.


ముత్యాలపల్లి ఝాన్సీలక్ష్మీబాయి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

విద్యార్థులు సృజనాత్మకతను పెంపొందించుకోవాలి

నరసాపురం రూరల్: ఇంజినీరింగ్ విద్యార్థులు విద్యతో పాటు సృజనాత్మకతను పెంపొందించుకోవాలని సివిల్ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ డాక్టర్ చైతన్య భారతి అన్నారు. మంగళవారం మండలంలోని సీతారామపురం స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో వ్యవస్థాపకతపై జరిగిన అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులు సాంప్రదాయ పద్ధతుల పరిమితుల నుంచి విముక్తి పొందడం ద్వారా విద్యార్థులు తమ సృజనాత్మక సామర్థ్యాన్ని పెంపొందించుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.సురేష్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మరో ముఖ్య అతిధి ఎలక్ట్రోప్రో ఇండియా అండ్ గ్లోబల్ స్టార్టప్స్ వ్యవస్థాపకుడు సప్పగడ్డి వెంకటేష్ మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లో భారత్ ముందంజలో నిలవడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో తోడ్పడతాయన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కేవీ సత్యనారాయణ మాట్లాడుతూ తమ కళాశాలలో ఎన్నో ఫెస్ట్‌లు నిర్వహించామని తద్వారా విద్యార్థుల అభివృద్ధికి తోడ్పడ్డామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కోశాధికారి కేవీ స్వామి, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చైతన్య భారతి

పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలపై పోరాటం

భీమవరం: కేంద్ర ప్రభుత్వం నూతనంగా అధికారంలోకి వచ్చిన తరువాత నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగి సామాన్య, మధ్య తరగతి ప్రజానీకం అనేక ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం జిల్లా నాయకుడు కె. రాజారామ్మోహన్‌రాయ్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం పట్టణంలోని సుందరయ్య భవన్‌లో సీపీఎం రాజకీయ విజ్ఞాన తరగతుల్లో ఆయన మాట్లాడారు. ఉల్లిపాయలు, కూరగాయలు, పచ్చిమిర్చి ధరలు కిలో వంద రూపాయలకు పెరిగి ప్రజలు కొనుగోలు చేయలేని పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే నిత్యావసర వస్తువుల ధరలు తగ్గిస్తామని చెప్పి ప్రజలు మోసం చేసిందన్నారు. ఇప్పటికైనా పెరిగిన నిత్యావసర వస్తు ధరలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నియంత్రించాలని లేకుంటే ప్రజలతో కలిసి ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు. రాజకీయ విజ్ఞాన తరగతుల్లో సీపీఎం పట్టణ కార్యదర్శి బి వాసుదేవరావు తాజా రాజకీయ పరిస్థితులు, నూతన ఆర్థిక విధానాలను బోధించగా ఈ తరగదులకు గొర్ల రామకృష్ణ ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు.


భీమవరంలో సీపీఎం రాజకీయ విజ్ఞాన తరగతుల్లో మాట్లాడుతున్న రాజారామ్మోహన్‌రాయ్

విజయం బాధ్యతను పెంచింది

పాలకొల్లు సెంట్రల్: నియోజకవర్గ ప్రజలు హ్యాట్రిక్ విజయంతో పాటు అత్యధిక మెజార్టీని ఇచ్చి నాపై మరింత బాధ్యతను పెంచారని, రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. మంగళవారం స్థానిక మునిసిపల్ కార్యాలయంలో నియోజకవర్గస్థాయి అధికారులతో రివ్యూ మీటింగ్ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మంత్రి రామానాయుడు మాట్లాడుతూ త్వరలోనే నియోజకవర్గంలోని సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతానని వివరించారు.

జాతీయ నాయకుల స్ఫూర్తితో రాజకీయం

యలమంచిలి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మొదటి ఉప ప్రధాని బాబూ జగజ్జీవన్‌రావు, మథర్ థెరీసాల స్ఫూర్తితోనే నేను రాజకీయాలలోనికి వచ్చానని నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. ఆర్యపేట గ్రామంలో తన సొంత ఖర్చుతో నిర్మిస్తున్న అంబేడ్కర్, బాబూ జగజ్జీవన్‌రావు విగ్రహాల మండప నిర్మాణం మంగళవారం ప్రారంభించారు.


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు

పేద కుటుంబానికి ఆర్థిక సాయం

పాలకోడేరు: మండలంలోని విస్సాకోడేరు గ్రామానికి చెందిన మండ సోమేశ్వరరావు కుటుంబం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నారని తెలుసుకుని హైదరాబాద్‌కు చెందిన సన్నిధి రామలింగేశ్వరరావు, గణపవరానికి చెందిన వంకాయల ఏడుకొండలు కలిసి పది వేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు. దాతలను ఆర్య వైశ్య మహాసభ కోశాధికారీ గ్రంధి రాజా అభినందించారు. ఈ కుటుంబం పరిస్థితిని సోషల్ మీడియా ద్వారా తెలుసుకుని ఎక్కడో దూరంగా ఉన్న హైదరాబాద్ నుంచి, గణపవరం నుంచి వచ్చి సాయం చేయడం గొప్ప విషయం అని ప్రశంసించారు.

రజకుల చెరువు ఆక్రమణలను తొలగించాలని ధర్నా

ఆకివీడు: తరతరాలుగా అనుభవిస్తున్న రజక చెరువును గత కొన్నేళ్లుగా ఆక్రమణలకు గురైందని ఉమ్మడి జిల్లా రజక సంఘం అధ్యక్షులు చిలకలపల్లి కట్లయ్య ఆందోళన వ్యక్తంచేశారు. మండలంలోని పెదకాపవరం గ్రామంలో రజక చెరువు ఆక్రమణలపై మంగళవారం చెరువు వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1999 నుంచి 2022 సంవత్సరం వరకూ ఆ భూమి అడంగళ్‌లో చాకలి చెరువుగా నమోదైందని చెప్పారు. అనంతం వడుపు నాగేశ్వరరావు పేరు మీద మార్చడం దారుణమన్నారు. చెరువు విషయంలో రెవెన్యూ అధికారులు రికార్డుల్ని తారుమారు చేశారని కట్లయ్య ఆరోపించారు. పంచాయతీ లీజు కట్టించుకోకుండా కాలయాపన చేసిందన్నారు. చెరువును ఆక్రమించిన వ్యక్తులు రజకులపై దౌర్జన్యానికి దిగారని వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం డీఎస్పీ, సీఐ, ఎస్సైలు సంఘటనా స్థలానికి వచ్చి కట్లయ్యతో చెరువు విషయంపై సమీక్షించారు. ధర్నా అనంతరం రజక సంఘ నాయకులతో కలిసి కట్లయ్య జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. జీఓ-62 ప్రకారం రజక సంక్షేమ కమిటీని ఏర్పాటు చేయాలని, రజకుల సమస్యల్ని పరిష్కరించాలని వినతిపత్రం అందజేసినట్లు స్థానికంగా విలేకర్లకు తెలిపారు. దీనిపై కలెక్టర్ స్పందించి ఆర్డీను విచారించాలని ఆదేశించినట్లు కట్లయ్య చెప్పారు. కార్యక్రమంలో రజక సంఘ నాయకులు మహంకాళి, యండమూరి శ్రీను, ఐ.ఫణికుమార్, వై.వెంకటలక్ష్మి, పెద్దిరాజు పాల్గొన్నారు.

పాఠశాలల్లో మెరుగైన వసతులు

భీమవరం: ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి లో మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించామని చిన్నారులు తప్పనిసరిగా బడిలోనే ఉండాలని జిల్లా విద్యాశాఖాధికారిణి (డీఈవో) జీ.నాగమణి అన్నా రు. నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా మంగళవారం భీమవరం పట్టణంలోని 39వ వార్డు లో పర్యటించి మధ్యలో బడి మానేసిన పిల్లల తల్లిదండ్రులను కలిసి వారితో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విద్యతోపాటు ప్రతి విద్యార్థికి పాఠ్య, నోట్ పుస్తకాలు, బ్యాగ్‌లు, షూస్, సాక్స్, యూనిఫామ్ వంటివి ఉచితంగా అందిస్తూ రుచి, శుచికరమైన పౌష్టికాహారం అందిస్తున్నట్లు నాగమణి చెప్పారు. ఈ సందర్భంగా లంకపేట ఏరియా లో నివసిస్తున్న ప్రతిఇంటికీ వెళ్లి బడికివెళ్లని పిల్ల లను గుర్తించి వారి తల్లిదండ్రులను ఒప్పించి బడి లో చేర్పించారు. ఈ సందర్భంగా ప్రైవేటు స్కూల్లో ఆరో తరగతి చదివి ఫీజులు కట్టలేక రెండేళ్లుగా బడి మానేసిన విద్యార్థిని మౌనికతో మాట్లాడారు. ప్రైవే ట్ పాఠశాల యాజమాన్యంతో డీఈవో మాట్లాడి టీసీ ఇప్పించి, పట్టణంలోని పొట్టిశ్రీరాములు మునిసిపల్ గరల్స్ హైస్కూల్లో చేర్పించేందుకు చర్యలు తీసుకున్నారు. అనంతరం పేద పిల్లలకు బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ పీ.శ్యాంసుందర్, డిప్యూటీ డీఈవో ఏ.శ్రీరామ్, సెక్టోరియల్ ఆఫీసర్స్ సీహెచ్.సుబ్రమణ్యం, వై.చంద్రశేఖర్, భీమవరం రోటరీ క్లబ్ సెక్రటరీ షేక్ బాబాజీ సాహెబ్, ప్రధానోపాధ్యాయుడు సుధాకర్ పాల్గొన్నారు.


పిల్లలకు బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న డీఈవో నాగమణి

క్లుప్తంగా

పాము కాటుకు గురైన ఉపాధి కూలీ


సిద్ధాంతం పీహెచ్‌సీలో ఉపాధి కూలీకి వైద్యం చేస్తున్న దృశ్యం

పెనుగొండ: దేవలో ఉపాధి పనులు చేస్తుండగా గుడాల లలిత పాము కాటుకు గురైంది. మంగళవారం దేవ శివారు పెళ్లి కూతరుమ్మ చెరువు వద్ద పంటకాలువలో సుమారు 40 మంది ఉపాధి కూలీలు పనులు పూర్తి చేస్తుండగా పాము కాటు వేసింది. దీంతో లలితను సిద్ధాంతం పీహెచ్‌సీకి తరలించి ప్రాథమిక వైద్యం అందించి, మెరుగైన వైద్యం కోసం పెనుగొండ నుంచి తణుకు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఎంపీడీఓ ఎస్.శ్రీనివాస దొర, టీపీ శంకర్‌లు లలితను పరామర్శించారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి


కొడమంచిలిలో విద్యార్థులకు కిట్లు పంపిణీ చేసిన ఎంపీపీ సూర్యకుమారి

పెనుగొండ: విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆచంట ఎంపీపీ దిగమర్తి సూర్యకుమారి అన్నారు. మంగళవారం కొడమంచిలిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు, విద్యా సామగ్రి పంపిణీ చేశారు.

వైభవంగా ముసలమ్మ ఆలయ వార్షికోత్సవం


ప్రత్యేకాలంకరణలో ముసలమ్మ

పెనుగొండ: మండలంలోని ములపర్రు మారేమ్మ గద్దే వద్ద ముసలమ్మ అమ్మవారి ఆలయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. మంగళ వారం మారేమ్మ గద్దే శెట్టి బలిజ సంఘం ఆధ్వర్యంలో వార్షికోత్సవం నిర్వహించి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద పిండివంటలతో భారీ అన్న సమారాధన నిర్వహించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నరసింహస్వామికి వార్షిక కల్యాణం


కొంతేరులో శ్రీ లక్ష్మీ నరసింహస్వామికి వార్షిక కల్యాణం చేస్తున్న అర్చకులు

యలమంచిలి: నిర్జల ఏకాదశి పర్వదినం సందర్భంగా కొంతేరు గ్రామంలోని శ్రీ కుంతీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో సోమవారం రాత్రి వార్షిక కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు పూలపల్లి వేణునాథ్ ఆధ్వర్యంలో వేద పండితులు శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. వర్ధినీడి మణికంఠ, సింధు దంపతులు పీటలపై కూర్చుని కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి విచ్చేసి దేవేరులను దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఆలయ ఈఓ మామిడిశెట్టి వీర వెంకట శ్రీనివాస్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

టీసీలు తీసుకున్న తొమ్మిది మంది విద్యార్థులు

యలమంచిలి: అబ్బిరాజుపాలెం పంచాయతీ నక్కాపాలెంలో స్కూల్ స్థల వివాదం నేపథ్యంలో తొమ్మిది మంది విద్యార్థులు మంగళవారం టీసీలు తీసుకుని ఇతర పాఠశాలలకు వెళ్లిపోయారు. వివరాలలోనికి వెళితే నక్కాపాలెంలో ప్రస్తుతం ఉన్న పాఠశాల స్థలంలోనే కొత్త పాఠశాల నిర్మించాలని ఒక వర్గం, ఆ స్థలం ఇరుకుగా ఉన్న నేపథ్యంలో వేరే స్థలంలో నిర్మించాలని వేరొక వర్గం రెండేళ్లుగా తగవు పడుతున్నారు. దీంతో ఇరు వర్గాల నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ స్వయంగా పరిశీలనకు వచ్చి ప్రస్తుతం పాఠశాల ఉన్న స్థలం ఇరుకుగా ఉందని, కొత్త స్థలంలో పాఠశాల నిర్మించాలని ఆదేశించడంతో కొత్త స్థలంలో పాఠశాల నిర్మాణం ప్రారంభించారు. ప్రస్తుతం ఆ భవన నిర్మాణం చివరి దశకు చేరుకుంది. దీంతో నిరాశకు గురైన రెండవ వర్గం వారు గత అక్టోబర్ నెల నుంచి తమ పిల్లలను పాఠశాలకు పంపడం మానివేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఆ వర్గానికి చెందిన తొమ్మిది మంది విద్యార్థులు టీసీలు తీసుకుని ఇతర పాఠశాలలకు వెళ్లిపోయారు. ప్రస్తుతం పాఠశాలలో 11 మంది విద్యార్థులు ఉండగా తొమ్మిది మంది విద్యార్థులు టీసీలు తీసుకోవడంతో పాఠశాలలో ఇద్దరే విద్యార్థులు మిగిలారు.

రాజగోపాలస్వామికి మామిడి పండ్ల అలంకరణ


ప్రత్యేక అలంకరణలో రాజగోపాల స్వామి

మొగల్తూరు: స్థానిక రుక్మిణీ సత్యభామా సమేత రాజగోపాలస్వామి వారి ఆలయంలో స్వామి వారిని మంగళవారం మామిడి పండ్లతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకులు సుదర్శనం లక్ష్మీ నరసింహాచార్యలు, రామ్‌కుమార్ ఆచార్యులు,రామ్‌శేషు ఆచార్యులు ప్రత్యేక పూజలు నిర్వంచి భక్తులకు ప్రసాద వితరణ నిర్వహించారు.

పక్కా రోడ్డు నిర్మించాలి

నరసాపురం: పట్టణంలోని చలువపేటలో పాత సొసైటీ భవనానికి వెళ్లే దారిలో పక్కా రోడ్డు లేక స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ ప్రాంతంలో సుమారు 200 కుటుంబాల వారు నివసిస్తున్నారు. వారంతా ఈ మట్టిరోడ్డు గుండానే ప్రయాణించాలి. ఈ ప్రాంతంలో రెండు సినిమా థియేటర్లు ఉన్నాయి. ప్రాధాన్యం ఉన్న ఈ రోడ్డు అభివృద్ధిపై మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం చూపిస్తున్నారు. ముఖ్యంగా వర్షం పడితే ఇటుగా ప్రయాణించడం సాధ్యం కావడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి పక్కా రోడ్డు నిర్మించాలని చలువపేట వాసులు డిమాండ్ చేస్తున్నారు.

విత్తన శుద్ధి చేయాలి

మొగల్తూరు: రైతులు తప్పనిసరిగా విత్తన శుద్ధి చేయాలని వ్యవసాయాధికారి అబ్దుల్‌రహీమ్ మంగళవారం తెలిపారు. పొడి విత్తనాలకు అయితే 1 కేజీ విత్తనాలకు 3 గ్రాముల కార్బోండిజంను, తడి విత్తనాలకు అయితే 4 గ్రాముల కార్బోండిజంను కలిపి విత్తన శుద్ధి చేయాలన్నారు. మండంలోని 17 గ్రామాలకు సంబంధించి 980 ఎకరాల్లో సార్వా సాగు చేపడతారని అంచనా వేస్తున్నామన్నారు. రైతులు ఎంటీయూ స్వర్ణ 7029, 1061 ఇంద్ర, 1064 అమర, 1262 మార్టేరు మసూరి, ఎంటీయూ 1318 శీతాకాలం సన్నాలు వినియోగించాలన్నారు. లోతట్టు పంట చేలకు 1100 బాడవ మసూరి, ఎంటీయూ 1140 బీమా, ఎంటీయూ 1064 అమర, ఎంటీయూ 1172, ఎంటీయూ 1318 వంటివి అనుకూలంగా ఉంటాయన్నారు. చవుడు బూములకు అయితే ఎంటీయూ 1293, ఎంసీయు 103 వంటి విత్తనాలు అనుకూలంగా ఉంటాయన్నారు. రైతులకు సలహాలు, సూచనలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని వివరించారు.

తాచుపామును రక్షించిన స్నేక్ క్యాచర్


తాచుపామును సంరక్షిస్తున్న స్నేక్ క్యాచర్ మాధవ్

వీరవాసరం: మూగ జీవులు, మూగ ప్రాణాల పట్ల సమాజంలోని ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని స్నేక్ క్యాచర్ పి.మాధవ్ తెలిపారు. వీరవాసరం మండలం రాయకుదురు లింగాకారం సెంటర్లో వలలో చిక్కుకున్న ఆరడుగుల నాగుపామును మంగళవారం ఆయన రక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయకుదురు గ్రామానికి చెందిన సర్వేశ్వరరావు తమ ఇంటి వద్ద అల్లిన ఫెన్సింగ్ వలలో నాగు పాము చిక్కుకుంది. ప్రాణాపాయ స్థితిలో ఉన్న నాగుపామును రక్షించడానికి ఫోన్లో విషయం తెలుపగా కొవ్వూరు నుంచి రాయకుదురు వచ్చినట్లు తెలిపారు. వలలో చిక్కుకున్న పామును రక్షించి ఆహార పానీయాలు అందజేసినట్లు తెలిపారు. పామును సంచిలో భద్రపరిచి అడవిలో వదిలి వేస్తామన్నారు.